సినిమా ఛాన్స్

నందయ్య ఇంతకాలంగా అనుమానిస్తున్నదంతా అక్షరాలా నిజమై వూరుకుంది!

"నీకు గొప్ప భవిష్యత్తు వుంది ఇదిగో యీ రేఖ చూశావ్?" అన్నాడు హెడ్ మాష్టరు అరచేతిమీద పెన్సిల్‌తో గీస్తూ

"ఆఁ ఆఁ!" అన్నాడు నందయ్య ఆశ్చర్యంగా! ఈ ముప్ఫై యేళ్ళలో తన అరచేతిని తనెప్పుడూ చూసుకోలేదన్నట్టు

"నీకు గొప్పభవిష్యత్తు వుంది!" అన్నాడు హెడ్మాష్టరు మళ్ళీ

"ఈ టీచరు వుద్యోగంలోనే అంటారా?" అని అడిగాడు నందయ్య అనుమానిస్తూ

"ఈ టీచరు వుద్యోగంలో ఏముందోయ్? ఎన్నాళ్ళున్నా ఇక్కడ పిల్లలకు ఓనమాలు దిద్దిపెట్టవలసిందే?" అన్నాడు హెడ్ మాష్టరు

"మరి, నా భవిష్యత్తు ఎందులో నంటారు?"

"ఓరి పిచ్చివాడా!" అన్నాడు హెడ్మాష్టరు జాలిపడుతున్నట్టు

నందయ్య వుక్కిరిబిక్కిరయ్యాడు తనభవిష్యత్తు ఎక్కడ? ఎందులో వున్నట్టు?

"రాత్రి ఉద్యోగవిజయాల్లో నీ కృష్ణపాత్ర చూశాను అందుకనే తెల్లారి నీచేతిని చూడాలని బుద్ధి పుట్టింది ఇప్పటికైనా తెలిసిందా నీ భవిష్యత్తు ఎందులో వుందో?"

"ఆఁ ఆఁ! తెలిసింది తమరు చెప్పేది"

"నాటకరంగంలో అసలు కాదు సినిమారంగంలో! నువ్వు కాస్త చొరవకనబరిస్తే-లక్షలు కోట్లుగడించే అవకాశంవుంది"

"తమదయ!" అనిమాత్రం అనగలిగాడు నందయ్య

"శుభస్య శీఘ్రం!" అన్నాడు హెడ్మాష్టరు

'నాకు చాలాకాలంగా యీ అనుమానం వుంది కాని మీరన్నట్టు—ఆ సాహసం చొరవా నాలో లేదు"

"నాకు తెలుసు నాకు తెలుసు!" అన్నాడు హెడ్మాష్టరు నవ్వుతూ "నువ్వు సినిమాల్లో చేరాలని చాలాసర్దా పడుతున్నట్టు విన్నయ్య చెప్పాడు రాత్రి నీ కృష్ణవేషం చూసింతరవాత శుభస్య శీఘ్రం"

నందయ్య హెడ్మాష్టరుకు నమస్కరించి ఇంటికి బయలుదేరాడు తనది చిన్నప్పటినుంచీ అదృష్టజాతకమే అనేది ఇప్పటికి బాగా రుజువయింది పాపన్నకాపు కున్న ఐదుగురు సంతానంలో కడగొట్టువాడైన తనకొక్కడికి మాత్రమే ధర్డ్‌ఫారంచదివే యోగ్యత పట్టింది ఈ తాళ్ళ గరువులో ఒక్క కరణం శేషగిరిరావుతప్ప తనంత చదువు చదివినవాడు మరి లేదు!

చిన్నప్పుడు కంట్లో జిల్లేడుపాలు పడినప్పుడే తనభవిష్యత్తుకు పునాదులుకూడా పడివుండాలి పన్నెండేళ్ళ వయసులో కళ్ళ జోడు పెట్టుకు తిరగవలసి వచ్చేసరికి

"ఏం పాపన్నా! నందిగాణ్ణి ఆ కళ్ళజోడుతో గొడ్లకాయిం చేస్తున్నావ్ రేపు పెద్దవాడై పార దమ్ము చేయవలసొచ్చినా ఆ కళ్ళజోడుతోనే చేయాలిగదా! ఎంతదారుణం? నన్ను చెప్పమంటే అది నిజంగా ఆ కళ్ళజోళ్ళు పెట్టుకునే వాళ్ళందరికే అవమానమంటాను ఒక్క జిల్లాకలెక్టరుకు తప్ప ఈ చుట్టుపట్ల మరెవ్వరికీ కళ్ళజోడులేదు వాడికి మంచి భవిష్యత్తుండే, ఆ కళ్ళజోడుపెట్టే యోగ్యత వచ్చి వుండాలి చదివించు— తప్పక చదివించు!" అన్నాడు పెద్దకరణం

అంతే! తను గొడ్లకాసేకర్ర నాగుజెముడుపొదలో పారేసి, పలకాబలపం పుచ్చుకుని సుబ్బయ్యపంతులు దగ్గిరకి బయలు దేరాడు

అంతా అదృష్టమే అనాలి! ఏడాది తిరక్కముందే తాళ్ళ గరువులో జిల్లాబోర్డువాళ్ళు స్కూలు స్థాపించారు ఎన్ని దండ యాత్రలు కొడితేనేం ఇరవైయేళ్ళు వచ్చేసరికి తను థర్డ్ ఫారం ప్యాసై కూర్చున్నాడు

ఈ మధ్యకాలంలోనే తనకుఎందులో మాంచి భవిష్యత్తుందో ఆ కళారంగంలో తనకు చక్కని అవకాశాలు దొరికినై తనకు ఓంప్రథమంలో దొరికింది ప్రహ్లాదుడి వేషం

భుజంగం, ఆ హిరణ్యాకశిపుడివేషంలో తనని హడలకొట్టడం యీ నాటికీ బాగా గుర్తే

"ఎవడవురా నువ్వు డింభకా?" అని భుజంగం అనేసరికి, తనకి ప్రాణం పోయినంత పనైంది 'నీ కొడుకునే, ప్రహ్లాదుణ్ణి' అందామనుకున్నాడు కాని ఎదురుగా తండ్రి పాపన్న కనపడే సరికి తికమకపడి 'పాపన్నగారి సంటోణ్ణి!' అనేశాడు

ఆ రోజు నాటకం ఎంత రసాభాసయితేనేం? తనకు క్రమంగా కృష్ణపాత్ర వేసేవరకూ వరసగా అవకాశాలు చిక్కినై

"ఆహా, ఏమూ పట్టుపీతాంబరాలు, ఆ నెమలి పింఛం! శూద్రోడైతే మాత్రమేం, అచ్చగా ఆ కృష్ణపరమాత్మ జ్ఞప్తికి వస్తున్నాడు!" అని పెద్దకరణంగారి నాయనమ్మ అనేసరికి తనకు కలిగిన సంతోషం యింతింతకాదు

* * *

నందయ్య వర్తమానాన్ని మరచిపోయి, యిలా భూత భవిష్యత్తుల్లో భుజాలు రాసుకుంటూ ఇంటికొచ్చేసరికి, ముగ్గురు పిల్లలూ వచ్చి కాళ్ళు చుట్టవేసుకున్నారు

"అమ్మ తేగలు ఇవ్వనంటుంది" అన్నాడు వోహాడు "నా బలపం పిక్క సంటోడు మింగేశాడు నాకు బలపమే అయ్యా!" అన్నాడు యింకొకడు

నందయ్య గజిబిజిపడ్డాడు ముందు తేగలసంగతి ఆలోచించాలో, బలపం మింగినందుకు చిన్నవాణ్ణి నాలుగు తన్నాలో, వైద్యుడి దగ్గరకు తీసుకుపోవాలో అంతా మతిపోయేట్టయింది నందయ్యకు

ఏమీ జరగనట్టే ఇంట్లోకిపోయి, ఇంత పచ్చిపులుసుతో భోజనం ముగించి, హడావిడిగా స్కూలుకు వెళ్ళిపోయాడు

ఆ సాయంత్రం ఐదుగంటలకు తిరిగొచ్చేటప్పుడు హెడ్మాష్టరు మళ్ళీ హెచ్చరించాడు "కొంతచొరవా, సాహసం క బరిస్తే నీ భవిష్యత్తంతా బంగారుమయమే! తెలిసిందా?" అన్నాడు

ఇంటికి వస్తూ వస్తూ దారిలోవున్న దానయ్య కిల్లీకొట్లో నాలుగు బత్తాయికాయలు కొనాలనుకున్నాడు నందయ్య తను సినిమాల్లో చేరాలంటే కొంత అందంగా, రాజూగ్గా కనబడాలి తప్పదు

"దానయ్యా! ఓ నాలుగు బత్తాయిలు ఇవ్వు" అంటూ కొట్టుముందుకెళ్ళి, చేయి చాచాడు నందయ్య

"ఆఁ ఏమిటీ? బత్తాయిలే!" అన్నాడు దానయ్య బిత్తర పోతూ కొట్టుముందు బెంచీలమీద కూర్చున్న నలుగురైదు గురు వ్యక్తులూ తెల్లపోయారు

"ఏమిటి నందయ్యా! ఏమిటీ నువ్వడిగేది?" అన్నాడు వాళ్ళల్లో వొహడు

"బత్తాయి కాయలోయ్, బత్తాయికాయలు! ఎందుకంత ఆశ్చర్యం?"

"డి యి ఓ వస్తున్నాడా?" అన్నాడు వొహడు

"డి యి ఓ తప్ప నేనేమీ మనిషినే కాదంటావ్! ఆఁ?" అన్నాడు నందయ్య

కొట్లోకూచున్న దానయ్యా, ఆ నలుగురూ మొహ మొహాలు చూసుకున్నారు అంతపెద్ద సంసారాన్ని నలభై రూపాయల జీతంతో ఈదుకొస్తున్న నందయ్య హఠాత్తుగా కాయ ఒకటి మూణ్ణాలు పెట్టి బత్తాయిలు కొనడమంటే, వీడికి ఏమన్నా పోయేకాలం వచ్చిందా అనిపించింది

"ఏమైనా లాటరీ గెలుపు "

"లంకిణీబిందెలు దొరికివుంటయ్యోయ్" అని నవ్వేశాడు ఒహాడు

"లాటరీకాదు లంకిణీబిందెలుకాదు, సినీమాల్లో చేర బోతున్నాను ఏం?" అన్నాడు నందయ్య కాలు నువ్వుతూ

"ఏ సినిమాలో?" అంటూ అప్పటివరకూ అంతా వింటూ వూరుకున్న దానయ్య ప్రశ్నించాడు

"ఏ సినిమాఅయినా సరే- నాయిష్టంవచ్చిన సినిమా!"

నందయ్యకు ఈ ప్రశ్నలు, వాళ్ళ వాలకం, కంపరం ఎత్తించినై ఇలాంటి పల్లెటూరి బైతులమధ్య అంత చదువూ చదివిన తను, ఇంతకాలం ఎలా బగ్గలిగానా అనుకున్నాడు

"సినిమాల్లో చేరటానికి బత్తయికాయలకూ లంకేమిటి?" అన్నాడు ఒహాడు నిలదీసినట్టు

నందయ్యకు ఇక డబాయిస్తే లాభంలేదని తెలిసి పోయింది చుట్టుపట్ల నాలుగామడవరకూ, తనంత చదువు చదివినవాడు లేడని వూళ్ళోవాళ్ళందరికీ తెలుసు తాళ్ళగరువు హెడ్మాష్టరేం చదివాడో ఎవరికీ తెలియందికాదు కనక అసలుసంగతే చెప్పేద్దామనుకున్నాడు

"నేను ఈ పల్లెటూరి బడీపంతులు బతుకు వెళ్ళబోసేకన్న, సినిమాల్లోచేరితే మంచి భవిష్యత్తు వుందని హెడ్మాష్టరుగారు చెప్పారు నా చేతిలోవున్న ఈ రేఖ చూశారూ?" అన్నాడు చేయిచాస్తూ

"ఓహో అదా కథ!" అన్నాడు దానయ్య చూస్తూ

అ క్కడ కూర్చున్న నలుగురూ, దానయ్య నందయ్యలను చుట్టముట్టారు నందయ్య గర్వంగా తన చేతిలోని ఓ గీటును చూపిస్తూ—

"ఇదే మన భవిష్యత్తు నిర్ణయించబోతోంది హెడ్మాష్టరు గారు చెప్పారు ఇక కావలసిందల్లా, కాస్త సాహసం చూరవా! తెలిసిందా?" అన్నాడు

"ఆ రేఖకీ బత్తాయికాయిలకీ సంబంధ మేమిటి?" అన్నాడు దానయ్య

నందయ్య కోపంగా అందరికేసీ చూసి—

"మన మంచిచెడ్డలికీ, ఆ పైనతిరిగే గ్రహాలకీ సంబంధం వుందని బహుశా మీ బోటిగాళ్ళ కెవరికీ తెలీదు అట్లని మన ప్రయత్నం లేకుండా ఏమీ కాదు ఇక బత్తాయి కాయిలంటారా అవి శరీరానికి, కాంతినీ, పుష్టినీ ఇస్తవి గనక—సినిమాల్లో చేరే ముందు తింటే మంచిదనుకుంటున్నాను" అన్నాడు పారంచెప్పే ధోరణిలో

"తెలిసింది, తెలిసింది!" అన్నారు అందరు

"ఐతే, ఇక ఆ బత్తాయికాయలు నాలుగూ యిటు పడెయ్!" అన్నాడు నందయ్య

"కాని, ఒకమాటె నందయ్యా! సినిమాల్లో పెద్దవేషమే వేస్తావా?" అన్నాడు దానయ్య

"ఓ ఎంతపెద్ద వేషమైనా వేస్తాను రాజు అది దొరకక పోతే మంత్రి కథానాయకుడు అది కాకపోతే వాడి స్నేహితుడు అంతెకంటే ఇక కిందకొచ్చేది లేదు'

"ఏదో వూరికి ఇంతపేరు తీసుకురా!" అన్నాడు ఒకాడు

"పాపన్న పేరు నిలబెట్టు!" అన్నాడు మరొకాడు
"పెళ్ళాంబిడ్డలకు యేళకింత కూడుపెడితే అదే పదివేలు!"
అంటూ దానయ్య బత్తాయిలు నందయ్య చేతిలోపెట్టి, డబ్బులు గల్లాలో వేసుకున్నాడు

ఆ నాలుగు బత్తాయికాయల్ని, పైపంచలోకట్టి యింటికెసి బయలుదేరాడు నందయ్య తాళ్ళగరువులో పుట్టి పెరిగిన పాపన్న కడనారోడు, తారాపథానికి వెళ్ళడమంటే, నిజంగా అది తను బళ్ళోచెప్పే సప్తాద్భుతాలతో సమాన మైనదే అదృష్టవంతుణ్ణి ఎవడు చెడకొట్టగలడు కనక!

ఇంతకీ ఈ ముప్ఫైయేళ్ళ వయసులో తనకు కథానాయకుడి పాత్ర దొరుకుతుందా? తను గత యేడెనిమిదేళ్ళనుంచీ పాత గిలి పోయిన ఆడముఖాలతోనే యాక్టు చేయవలసి వస్తుందేమో హస్తసాముద్రికం, గ్రహబలం అంతా వుండి, ఆ ఒక్క డైరెక్టరు గారిదయ కలక్కపోతే తను పాతచింతకాయ పచ్చడితోనే తృప్తిపడి వూరుకోవలసి వస్తుంది అయినా ఫరవాలేదు డబ్బు, కీర్తి పేరుకు పోతూంటే ఇదేమంత బాధగా వుండదు

ఆ రాత్రి, తెచ్చిన ఆ బత్తాయికాయల్ని అంతా నిదర పోయిన తరవాత దొంగతనంగానే తినేందుకు తయారైయ్యాడు నందయ్య తీరా కాయవలిచి ఓబద్ద నోట్లో పెట్టుకోబోయేసరికి పెళ్ళాం రానేవచ్చింది

"ఏమిటీ యీ బత్తాయికాయిలూ యిదీ!" అంటూ నిలువుగుడ్లు వేసింది

"నేను సినీమాల్లో చేరదామనుకుంటున్నాను" అన్నాడు నందయ్య గుటకలు మింగుతూ

"సినిమాల్లోనా? సినిమాల్లో! అయితే బత్తాయికాయ లెందుకు? చంటివాడికి పాలడబ్బా కొనేందుకే డబ్బుల్లేక చస్తూంటే"

"నేను కడుపాత్రం కొందికీ తింటున్నాననుకున్నావా? కాస్త నీ మొగా కనపడాలి సినీమాల్లో చేరాలంటే"

"ఓహో! అప్పుడు సినిమావాళ్ళతో ఊరేగొచ్చు నేను చచ్చినా ఒప్పుకోను ఆ గాడిబావిలోపడి చచ్చింతరవాత నువ్వు వాళ్ళతో కులుకుదువుగాని"

భార్య అన్న ఆ మాటలు నందయ్య గుండెలకు కత్తిపోటుల్లా తగిలినై 'నీముఖానికి సినిమా వేషంకూడానా? పిచ్చేమైనా పట్టిందా? అన్నా అంతబాధ వుండేదికాదు తను సినీమాల్లో వేషంవేయడం అంతా నిశ్చయమై పోయినట్టే— ఆమె బాధపడుతోంది అంతా గ్రహబలం, తన అరచేతిలోని రేఖాప్రభావం అనుకున్నాడు

"ఒట్టు! నీమీద ఒట్టు" అన్నాడు నందయ్య శాంతంగా

"నామీద ఒట్టేమిటి? నేను చావకుండా బతికున్నాననా?" అన్నది భార్య

"అదికాదు ఈ తళ్ళగరువు పాపన్న వంశంలోనే పరస్త్రీని కన్నెత్తి చూసేవాడు యింతవరకూ పుట్టలేదు ఆఖరికి నీసంగతిచూసినా నీకు తాలికట్టేవరకు నిన్నో పరస్త్రీగానే చూశాను తెలుసుగదా!" అన్నాడు

"పాపన్న వంశంలో పుట్టినవాడెవడూ యింతవరకు గ్రామ పొలిమేరదాటి పోలేదు ఒకసారి పొలిమేర దేవత హద్దుల్లోంచి పోయాక, పాడుబుద్ధులు పుట్టవని నమ్మకమేంటి?

(7)

భార్య భోరు భోరు మని ఏడుస్తూంటే, నందయ్యకు ఆబత్తాయి కాయలు సయించినవి కావు భార్య చేతులో చేయివేసి బాస చేద్దామనిపించింది "నేను ఏకపత్నీవ్రతుడుగా వుంటాను ఒట్టు నీ చెయ్యి యిటివ్వు!" అన్నాడు నందయ్య

"ఏకపత్రీ లేదు, రెండుపత్రిలేదు నువ్వక్కడ నేనిక్కడ అయ్యో, నేనునిలువునా చావక యెందుకు బతికున్నాను?" అంటూ తలబాదుకోనాగింది

"నాకొచ్చే కీర్తిలో నీకూ వాలువుంటుంది!" అన్నాడు నందయ్య బతిమాలుతూ

"ఓహో! అలాగేం!" అన్నది భార్య

"నా కొచ్చేడబ్బులోనూ భాగం వుంటుంది"

"డబ్బు, డబ్బు! ఎంతడబ్బు" అంటూ కళ్ళెత్తి చూసింది

"లక్షలు, కోట్లు! ఈ మాట నేను చెప్పటంకాదు హెడ్మాష్టరుగారే చూసిచెప్పారు ఇక్కడ ఇక్కడ"

నందయ్య అరచేతిని భార్య కళ్ళముందుకు చాపాడు

"ఇక్కడేముంది! ముఖం నా పాడుముఖం!" అన్నదిభార్య

"ఉండేదంతా ఇక్కడేవుంది ఆగీట్లు, రేఖలు చూశావ్ మన భవిష్యత్తంతా, అంటే మనముందు ముదంతా అక్కడేవుంది!"

"అంటే నూనెగడ్డలోళ్ళు చెప్పారా సాముద్రికం?" అన్నది భార్య

"నూనెగడ్డలోళ్ళుకాదు ఇంగ్లీషు, సంస్కృతం తెలుగు అన్నీ బాగా, చదువుకున్న హెడ్మాష్టరుగారు చెప్పారు నేను పరాయి స్త్రీని కన్నెత్తయినా చూడనని ఒట్టు పెడుతున్నాను సినిమాల్లో ఎంత అందంగల హీరోయిన్లయినా సరే!"

"నాతోడూ?"

"అవును, నీతోడు"

"మన సంటోడితోడూ?"

"అవును అందరితోడు ఈ యిల్లూ, ఈ వూరూ, గ్రామ దేవత పెద్దేటమ్మా అందరితోడు సరేనా?" అన్నాడు నందయ్య కొంచెం విసుగ్గా

"సరే, అయితే! నువ్వు సినిమాల్లో చేరగానే నన్నూ అక్కడికి తీసుకెళ్ళాలి ఆ బత్తాయిలు నేనే వలచిపెడతాను ఇటివ్వు" అన్నది భార్య ప్రేమగా

తెల్లారగానే నందయ్య హెడ్ మాష్టరు ఇంటికి వెళ్ళాడు

"మద్రాసు వెళ్తున్నాను ఓ పదిరోజులు సెలవు ఇప్పించండి" అని అడిగాడు

"పదిరోజులు సెలవా! యెందుకు?" అన్నాడు హెడ్మాష్టరు

"ప్రయత్నంలో నెగ్గి సినిమాలో అవకాశం రాకముందే ఏ నెలరోజులో సెలవుపెట్టడం మంచిదికాదుగదా! అందుకని"

"ఓరి పిచ్చినందయ్యా!!' అన్నాడు హెడ్మాష్టరు పొట్ట చెక్కలయ్యేలా నవ్వుతూ "ఇంకా యీ పల్లెటూరి బడి పంతులు వుద్యోగంలోనే వుండాలని వున్నదన్న మాట అదృష్టం అందలాలవైపుకు లాగుతూంటే, ముద్ది గొంగళీమీదకు పోతుం దన్నమాట ఆఁ!" అన్నాడు

"ఐతే ఓ నెలరోజులు"

"పరీక్షలకుముందు సెలవు ఎలాదొరుకుతుంది? పైగా పట్టీ పట్టనట్లు ప్రయత్నిస్తే ఏపనులూకావు అందుకే నీచెయ్యి చూసి నప్పుడే చెప్పాను ధైర్యం, సాహసం కావాలని!"

"ఐతే, నేను రిజిగ్నేషను ఇస్తున్నాను" అన్నాడు నందయ్య
ఏ గ్రామదేవతపూని ఆ పలుకులు పలికించిందో మరి

ఆ రాత్రి మెయిల్‌కే నందయ్య మద్రాసు బయలుదేరాడు పెళ్ళాం హెచ్చరికలమీద హెచ్చరికలు చెప్పింది అందమైన ఆడవాళ్ళు వేసే పేచీలన్నీ ఏకరువు పెట్టింది 'నీలో ఏమైనా నిబ్బరం తగ్గేట్టుంటే, నన్నూ నా రూపాన్నీ మనసులో తలుచుకో' అని సలహా యిచ్చింది

భార్య మాటలు, తన భవిష్యత్తుమీాది నమ్మకం, తెచ్చిపెట్టుకున్న చొరవ, సాహసం రెక్కలు కాగా పక్షిలా ఎగిరి మద్రాసులో వాలాడు నందయ్య

మొదటినాడే 'ఎక్కడ మకాంచేయటం?' అనేది నందయ్యకు పెద్దసమస్య అయికూర్చుంది రోజుకు ఐదురూపాయలు మూాడు, రెండు, అంతకు తక్కువ అద్దెకున్న రూములే కనపడ లేదు రామస్వామి సత్రవా కన్నయ్యసెట్టి సత్రవా చీమ దూరే ఖాళీకూడా లేకుండా వున్నయి ఇప్పు డేంచేసేట్టు?

హైకోర్టు బీచీలో కూచుని, తన దగ్గిరవున్న డబ్బంతా అణాలు, పైసాలతో లెక్కపెట్టాడు అంతాకలిస్తే యాభై నాలుగు రూపాయల చిల్లర ఎందుకైనా మంచిదని నాయనమ్మ, మనవరాలి కోసమంటూ దిగవిడిచిపోయిన రెండు గోట్లూ తెచ్చాడు అవి అమ్మితే ఓ పాతిక రూపాయలు రావొచ్చు

సరే, నందయ్య స్టూడియోలకేసి బయలుదేరాడు తను మొట్టమొదట చూద్దామనుకుని వెళ్ళిన స్టూడియోముందు NO Vacancy అన్నబోర్డు కట్టివుంది నందయ్య గతుక్కు-

మన్నాడు ఆదిలోనే హంసపాదా అనిపించింది అయినా సాహసేలత్కిన్నా!

"డైరెక్టరుగారు వున్నారా?" అని అడిగాడు అక్కడ రూంలోకూచున్న ఒకర్ని

"ఏ డైరెక్టరుగారు?" అన్నాడు అతను గుబురుమీసాలు చిట్లిస్తూ

"సినీమాలు తీస్తారే, వారు!" అన్నాడు నందయ్య గుండె బిగువుగా

"ఓహో అదా! అలాంటి వారెవరూ ఇక్కడ వుండరు యిది స్టూడియో ఐనా యేం పని?" అన్నాడు అతను అనుమానంగా

"ఉద్యోగంకోసం "

"ఏంవుద్యోగం? నోవేకెన్సీ బోర్డు చూడలేదా?" అన్నాడు అతను కోపంగా

"ఉద్యోగం అంటే మామూలు వుద్యోగంకాదు సినిమాలో వేషానికి వచ్చాను" అన్నాడు నందయ్య తెలిసిందా అన్నట్టు

"ఓహో, తమపేరు వి నాగయ్యగారో లేక రాజ్ కపూరో అనుకుంటాం! అరే జంగ్ బహద్దర్ వీ వీ వీణ్ణి ఊఁ!" అన్నాడు నందయ్యకేసి చూస్తూ

గూర్ఖావాడు దగ్గిరకి రావడం చూసేసరికి నందయ్యకు పైప్రాణం పైనేపోయినట్టయింది భార్యా, పిల్లలూ ముఖ్యంగా ఆ చిన్నవాడు అంతా గుర్తుకొచ్చారు గూర్ఖా సమీపించకముందే అక్కడినుంచి రోడ్డుమీదికి గెంతేశాడు

తరవాత ఏంచేయడం అనేది పెద్ద సమస్యలా తయారైంది
పేరు మోగినవాళ్ళు అని తను అనుకున్న ఒక రిద్దరు యాక్టర్ల
దగ్గరకు వెళ్ళాడు

మీకు స్టేజి అనుభవం వుందా ?" అని అడిగాడు ఒక
యాక్టరు

"లేకేమండి, వుంది, మా తాళ్ళగరువులో ఏ నాటకం
వేసినా నేనే హీరోపాత్ర ధరిస్తుంటాను వుద్యోగవిజయాలూ
సతీసక్కు యింకా "

"చాలు చాలు ! నమస్తే !" అనేశాడు ఆ యాక్టరు

మరోయాక్టరుదగ్గిరా యిదేకథ మొదటివ డిలాగానే అన్ని
ప్రశ్నలూ అడిగి వుపరి "పాడగలరా?" అన్నాడు

నందయ్య తను బాగా పాడగల ననుకున్న పద్యం ఎత్తి
'ఆలును బిడ్డలేడ్వ తిరజాలను నెత్తురుకూడు మాధవా !'
అంటూ రాగయుక్తంగా ముగించాడు

ఆ యాక్టరు నవ్వేశాడు "మీరు త్వరగా యిక్కడినుంచి
తాళ్ళగరువు వెళ్ళిపోవటం మంచిది ఇక ఇక్కడ ఆలస్యం
చేశారంటే నెత్తురుకూడు కాదుగదా ఆఖరికి ఎంగిలికూడు
కూడా దొరకదు నమస్తే" అన్నాడు లేస్తూ

నందయ్య మళ్ళీ రోడ్డుమీదకు వచ్చాడు కథ యిలా అడ్డం
తిరిగిందేమో అనిపించింది అదృష్టం ఎంత హఠాత్తుగా తన
మీదికి ఎక్కికూచుందో అంత హఠాత్తుగానూ దిగిపోయిందని
తోచింది ఒకవేళ తనచేతిలోని ఆ రేఖ తారుమారయిందా ?
అరచేతిని బాగాపరీక్షించుకున్నాడు ఆ రేఖ అక్కడే, మద్రాసు
దుమ్ముతో కలసి ఇంకా స్పష్టంగా కనపడుతోంది

నందయ్య మరికొన్ని స్టూడియోలు తిరిగాడు పెద్ద యాక్టర్లని తెలుసుకున్న మరికొందర్ని చూశాడు ఆఖరికి తన అరచేతిలోని గీతలను తనకు సినిమారంగంలోవున్న భవిష్యత్తును గురించికూడా చెప్పాడు! కొందరు పిచ్చివాడనుకున్నారు మరికొందరు పిచ్చి ప్రారంభించింది అనుకున్నారు

నందయ్య జేబులో డబ్బు కాస్తా అయిపోయింది నాయనమ్మ తాలూకు గొల్లుకూడా అమ్మేశాడు ఆ డబ్బూ అయిపోయింది ఆఖరి రెండురోజుల్లో ఒకరాత్రి కూంనది కట్టమీదా మరో రాత్రి అడయారు బీచీగోనూ పడుకుని, టికెట్టు లేకపోయినా సాహసించి సెంట్రల్ స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ ఎక్కేశాడు

తిరిగి స్వగ్రామం వచ్చేసరికి అంతా చక్కబడుతుందనీ తన బాధలన్నీ మర్చిపోవచ్చుననీ అనుకున్నాడు నందయ్య హెడ్మాష్టరు తనను అమాయకణ్ణిచేసి, దద్దమ్మక్రింద ఆడించాడా అన్న అనుమానంకూడా కలక్కపోలేదు అతడికి ఏదియేమైనా తను మళ్ళీ ఆ టీచరు వుద్యోగంలోనే కొంతకాలం గడపవచ్చుననుకున్నాడు

గ్రామం చేరేసరికి అందరూ అతణ్ణి వింతగా చూడసాగారు తను ఖాళీచేసిన స్థానంలో హెడ్మాష్టరుగారి అల్లుణ్ణి టీచరుగా నియమించినట్లు తెలుసుకున్నాడు భార్య లబోదిబోమంటూ తల బాదుకోసాగింది

నందయ్య సరాసరి హెడ్మాష్టరు దగ్గరకు వెళ్ళాడు అతణ్ణి చూస్తూనే హెడ్ మాష్టరు ముసిముసి నవ్వులు నవ్వాడు

"మీ జ్యోతిష్యం ఫలించలేదు నా వుద్యోగం పోయింది యిక నాగతేంకాను?" అని ప్రశ్నించాడు నందయ్య

"ఓరి పిచ్చినందయ్యా!" అని బిగ్గరగా నవ్వాడు హెడ్ మాష్టరు "నా జ్యోతిష్యంలో లోపం యేమీలేదు నీలో చొరవా, సాహసం లోపించాయి రిజిగ్నేషన్ యిచ్చిం తరవాత బోర్డువాళ్ళు మళ్ళీ నీకు టీచరు వుద్యోగం ఎలానూ యివ్వరుగదా! ఆ ఖాళీలో వేసినవాడు నా ఆరో అల్లుడై వుండటం నాతప్పుకాదు ఈనాటికీ అంటున్నాను నీ భవిష్య త్తంతా సినీమారంగంలో నేవుంది నీ అరిచేతిలోని ఆ రేఖ "

నందయ్య తల వేలాడవేసుకుని ఇంటికి వెళ్ళాడు పెళ్ళాం పొయ్యిరాజేసి అప్పటికి నాలుగురోజులైంది పిల్లలు వొళకేగోల పెళ్ళాం అన్నది—

"వ్యావసాయ తరుణంగదా! పారదమ్మ కెళ్ళినా రోజుకు పదణాలకూలీ వస్తుంది ఈ నెలరోజులపాటూ "

"ఈ కళ్ళజోడుతోనా?" అంటూ పళ్ళుకొరికాడు నందయ్య

"ఏంపాయే కళ్ళజోడు తీసేసి వెళ్ళు!" అన్నది పెళ్ళాం

'కళ్ళజోడు తీసేస్తే పారకీ, పలుకీ తేడా తేలీదే! ఎంత ఖర్మపట్టింది! అనుకున్నాడు నందయ్య

ఆ రోజు పెద్దకరణం చేలోనే పారదమ్ముకు వంగాడునందయ్య

"ఎవడ్రా వాడు? కళ్ళజోడు పెట్టుకుని పారదమ్మకొచ్చాడు!" అంటూ గద్దించాడు పెద్దకరణం

"నేనండీ పాపన్న చిన్నకొడుకుని "

"ఓరి వెధవా! కళ్ళజోడూ నువ్వూ, పారదమ్మ చేసేదేమిటి? లే, లే పదణాలు దండగ!" అన్నాడు పెద్దకరణం

కళ్ళజోడు తీసి చేనుగట్టుమీద పెట్టి, నడుం వంచాడు నందయ్య